క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: సాలార్‌జంగ్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నయాపూల్, మదీనా, పటేల్ మార్కెట్, బీజీ మార్కెట్, రికాబ్‌గంజ్, పత్తర్‌గట్టీ, క్యాక్యూ స్టేడియం, సిటీ కాలేజీ, చేలాపురా, మూసాబౌలి, హుస్సేనీఆలం, దారుషిఫా, పురానీహవేలీ, చెత్త బజార్, జహెరానగర్, మీరాలం మండి, దివాన్‌దేవుడి, గుల్జర్ హౌస్, సివిల్ కోర్టు, ఎతేబార్ చౌక్, గురాన్‌గల్లీ, కాలీకమాన్, పంజేషా తదితర బస్తీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట వేలాది మంది పర్యాటకులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో పెద్దసంఖ్యలో పర్యాటకులు కోటకు తరలివచ్చారు. ఇతర రాష్ట్రాలతోపాటు విదేశీ పర్యాటకులు సైతం కోటలో సందడి చేశారు. ముఖ్యంగా ఎత్తైన కోట గోడలు, ఫిరంగులు, నగీనా బాగ్‌లోని సైనికుల గదుల వద్ద సెల్ఫీలు దిగుతూ పర్యాటకులు సందడి చేశారు. భారీగా వచ్చిన పర్యాటకులతో కోట పరిసరాల్లోని షాపులు పర్యాటకుల కొనుగోళ్లతో సందడిగా మారాయి.

కార్మికులకు అండగా మజ్దూర్ యూనియన్



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో సమావేశమైన ఆదిల్‌షరీఫ్

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ కార్మికులకు న్యాయం చేయాలని మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ విజ్ఞప్తి చేశారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌ను కలిసి సికింద్రాబాద్ జోన్‌లో జోనల్ కమిషనర్ కార్మికులకు వచ్చే బెన్ఫిట్ ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. గతంలో లేబర్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చినా సికింద్రాబాద్ జోన్‌లో అమలు కావడంలేదన్నారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గోల్కొండ: రిపబ్లిక్ డే సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అప్పటి నాయకుల పాత్రపై ఈ వ్యాసరచన పోటీ ఉంటుందని ఆయన తెలిపారు. 2 పేజీలకు మించకుండా విద్యార్థులు వ్యాసాన్ని రాయాలని ఆయన సూచించారు. మొదటి బహుమతితో పాటు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని ఆయన తెలిపారు. రాసిన వ్యాసాన్ని ఈనెల 25వ తేదీ లోపు 90006 28035కు వాట్సాప్ చేయాలని ఆయన సూచించారు.

వాసవి సేవాకేంద్రంలో శ్రీనివాస కల్యాణం

ఖైరతాబాద్: వాసవి సేవాకేంద్రం, వాసవి క్లబ్ హైదరాబాద్ సంయుక్తంగా శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం వాసవి సేవాకేంద్రంలో ఈ వేడుక నిర్వహించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, వాసవి సేవాకేంద్రం అధ్యక్షుడు ఆలంపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఈదమ్మ బోనాలు



రాజేంద్రనగర్: బుద్వేల్ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈదమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సోదరులు భారీ ర్యాలీగా అమ్మవారి తొట్టెలను ఊరేగించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ అనంతరం ఆదివారం రోజున ఈదమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఆలయానికి వచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేపట్టారు.

యువత మార్నింగ్ వాక్ అలవాటు చేసుకోవాలి



హారూన్ ఫరాన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: యువత మార్నింగ్ వాక్ అలవాటు చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. దక్కన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ వారు ఆదివారం వాకథాన్–2023 నిర్వహించారు. ఈ సందర్భంగా వాకథాన్‌లో పాల్గొన్న వారికి ఆయన జ్ఞాపికను అందజేశారు. వాకింగ్‌తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అయితే వాకింగ్‌కు వెళ్లే వారితో చాలా మంది సీనియర్ సిటిజన్స్ అని ఆయన అన్నారు. జీవన శైలిలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, దీని ద్వారా చిన్న వయస్సు నుంచే ఎందరో వివిధ రోగాల బారినపడుతున్నారన్నారు. వాకింగ్ ఎన్నో రోగాలకు సంజీవని వంటిదని ఆయన అన్నారు. రక్తపోటు, ఊబకాయం వంటి రుగ్మతలకు వాకింగే నివారణ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, బదరుద్దీన్, దక్కన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హరిజన సేవక్ మండలి నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు



మంత్రి తలసానిని కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్, హరిజన సేవక్ మండలి సభ్యులు

అబిడ్స్: చుడిబజార్‌లోని హరిజన సేవక్‌మండలిపై అంతస్తు నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. హరిజన్ సేవక్ మండలి సభ్యులు బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి మంత్రి తలసానిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరిజన్ సేవక్‌మండలి మొదటి అంతస్తు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. హరిజన్ సేవక్ మండలి అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, ధర్మేందర్, దేవేందర్, చంద్రమోహన్, వెంకటేష్, నాగేశ్వర్‌రావు, పి.వెంకటేష్, సాయికుమార్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

26న దేవాదాయ, ధర్మాదాయ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

సుల్తాన్‌బజార్: దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జేఏసీ 2023 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణను ఈ నెల 26న బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించనున్నట్లు చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కందూరి కృష్ణమాచార్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం సారస్వత పరిషత్‌లో వారు మాట్లాడుతూ.. డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేవీ.రమణాచారి, ప్రముఖ్య జోతిష్య పండితుడు లక్ష్మీకాంశర్మ, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ అనిల్‌కుమార్, టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి, కృష్ణవేణి తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్‌రావు, పరశురామ్ రవీంద్రచార్యులు, కేశవ్‌రావు, కృష్ణమాచారి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

దేశభక్తి, జాతీయ భావాలపై విస్తృత ప్రచారం అవసరం

హిమాయత్‌నగర్: దేశభక్తి, జాతీయ భావాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సుధాన్షు త్రివేది పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల్లో భాగంగా దేశభక్తి, జాతీయ భావాలు, 'కుటుంబ వ్యవస్థలో క్షీణిస్తున్న విలువలు –సమాజంపై ప్రభావం' అనే అంశంపై ఆదివారం నారాయణ గూడలోని కేశవ్‌మెమోరియల్ ఆడిటోరియంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సుధాన్షు త్రివేది మాట్లాడుతూ సమాజ మార్పు అభివృద్ధి, పరివర్తనలో కుటుంబాల పాత్ర చాలా కీలకమన్నారు. క్షీణిస్తున్న విలువలను కాపాడుకోవాల్సిన అవసరం కుటుంబాలపై ఉందన్నారు. కుటుంబంలోని పిల్లలకు కూడా చిన్నతనం నుంచే దేశభక్తి, జాతీయ భావాల గురించి బోధించాలన్నారు. తద్వారా వారు దేశభక్తి కలిగి దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతారన్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సుధాన్షు త్రివేది

మాజీ న్యాయమూర్తి ఎల్.నరసింహారెడ్డి, కార్పొరేటర్ జి. మహాలక్ష్మి గౌడ్, బీజేపీ నాయకులు జి.రామన్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం కాలేజీ ఆవరణలో ఉన్న సర్దార్ వల్లవభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు.

అథ్లెటిక్స్‌లో మైలవరపు భవానీ సత్తా



మెడల్స్, సర్టిఫికెట్స్ అందుకుంటున్న మైలవరపు భవానీ

బండ్లగూడ: నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్‌షిప్–2023లో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రాంతానికి చెందిన మైలవరపు భవానీకి నాలుగు మెడల్స్ దక్కాయి. మెదక్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో మైలవరపు భవానీ పాల్గొని 5000 మీటర్ల రన్‌లో సిల్వర్ మెడల్, 100 మీటర్ల రన్‌లో సిల్వర్ మెడల్, 1500 మీటర్ల రన్‌లో గోల్డ్ మెడల్, రిలే రన్‌లో గోల్డ్ మెడల్స్ సాధించింది. ఈ మేరకు నిర్వాహకులు ఆమెకు మెడల్స్ అందజేసి అభినందించారు.

మన సంస్కృతిలో ముగ్గులకు విశిష్ట స్థానం



ముషీరాబాద్: మనదేశ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసేందుకు ముగ్గుల పోటీలు ఎంతగానో దోహదపడతాయని చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో రంగవల్లులకు విశిష్ట స్థానం ఉందన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్ ముదిరాజ్ చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, సీఐలు జహంగీర్‌యాదవ్, సంజీవ్‌కుమార్ హాజరై ముగ్గులను పరిశీలించారు. సంఘం అధ్యక్షుడు సుదేష్, మహిళా అధ్యక్షురాలు ఊర్మిళ సంఘం ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి సతీష్‌కుమార్, నాయకులు నవీన్, నిర్మల, బన్నీ, శ్రీధర్ తదితరులున్నారు.

అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ల సమస్యల పరిష్కారానికి కృషి

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్ల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం మసీదుబండలోని తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ అపార్ట్‌మెంట్ల వాచ్‌మెన్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవనోపాధి కోసం వలస వచ్చిన వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం కనీసం వాచ్‌మెన్లకు రేషన్‌కార్డులు, పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు, కనీస సదుపాయాలను కల్పించడంలో విఫలమైందన్నారు. వీరి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం మెరుగు

కాచిగూడ: కరాటే సాధనతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని నిజామాబాద్ డీసీపీ గిరిరాజు అన్నారు. కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో ఆదివారం జరిగిన బెల్ట్‌గ్రేడ్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయన బెల్టులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, కరీం, సుభాష్, శ్యామ్‌కుమార్, హంస, మహేందర్, అమృతరెడ్డి, జానకి, యోగిని, షైనీ, నందిని తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



డబీర్‌పురా: నూర్‌ఖాన్‌బజార్ డివిజన్‌లో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.1.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డుతో పాటు మరిన్ని నిర్మాణ పనులను ఆయన చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్సీ హఫందీ, కార్పొరేటర్ అలందర్, నాయకులు కౌసర్, హైదర్‌తో కలిసి పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తదితరులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ సయ్యద్‌అలీగూడలోని 269 ఏళ్ల చరిత్ర గల సయ్యద్ అబ్దుల్లా షా రజ్వీ అల్ మదాని దర్గాలో ఆదివారం పెద్ద ఎత్తున ఉర్సు ఉత్సవాలు నిర్వహించారు. నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని పువ్వులు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ప్రతినిధి మహ్మద్ మూసా, ఏరియా సభ సభ్యులు సయ్యద్ అహ్మద్ రజ్వీ మాజీద్, షాబాజ్, మహ్మద్ షఫీ, మసూద్ రజ్వీ, సజ్జాద్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు విశేష స్పందన



కంటివెలుగు కేంద్రంలో సేవలు అందజేస్తున్న వైద్యులు, సిబ్బంది

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. రెడ్‌హిల్స్ డివిజన్ చింతల బస్తీ కురుమ సంఘం కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రానికి కంటి పరీక్షల నిమిత్తం అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. బీఆర్ఎస్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు మహ్మద్ సర్వర్ కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ సంధ్య డాక్టర్ లక్ష్మణ్ పర్యవేక్షిస్తున్నారు. ఆప్టోమెట్రిస్టు నరేష్, డీఈఓ శ్రీలత, పీహెచ్‌ఎస్ శకుంతల, ఏఎన్‌ఎం కవిత, భాగ్యలక్ష్మి పేదలకు సేవలు అందజేస్తున్నారు.

సిలిండర్లు పేలి దుకాణం దగ్ధం

విజయనగర్‌కాలనీ: స్టవ్ రిపేరింగ్ షాప్‌లో మంటలు అంటుకోవడంతో దుకాణం మొత్తం దగ్ధమైన ఘటన ఆదివారం హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. టోలీచౌకి హకీంపేట్ నాలా బ్రిడ్జి పక్కన రహీం గ్యాస్ స్టవ్‌ల రిపేరింగ్ షాప్ ఉంది. ఆదివారం సాయంత్రం సలీం అనే వ్యక్తి వెల్డింగ్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు స్టవ్ రిపేరింగ్ షాప్‌లో పడడంతో అందులో ఉన్న సిలిండర్లు అంటుకుని పేలిపోయాయి. కానీ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రేపు ఆటో డ్రైవర్ల సమ్మె

లిబర్టీ: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీఏ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల పనులు యధాతథంగా కొనసాగించాలని కోరుతూ ఈ నెల 24వ తేదీ చలో రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయం పేరుతో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్‌నగర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ వెల్లడించారు. నెల రోజులకు పైగా ఆర్టీఏ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు సంబంధించిన పనులు ఆర్టీ అధికారులు నిలుపుదల చేశారని అన్నారు. పాత ఆటోలు స్క్రాప్ చేసి కొత్త ఆటోలు కొనుగోలు విధానమును నిలిపి వేయటాన్ని ఆయన తప్పు పట్టారు. స్క్రాప్ విధానంను ఆర్టీఏ అధికారులు ఎందుకు నిలుపుదల చేశారని ప్రశ్నించారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కోట్లాది రూపాయల పెట్టుబడి

లిబర్టీ: రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు రావడం స్వాగతిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద్ అన్నారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కోసం పలు దేశాల కంపెనీలు ముందుకు వచ్చి 21 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు అంగీకారం కుదుర్చుకోవడం మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యావంతులైన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున లభించనున్నట్లు తెలిపారు. 2023 ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో నాలుగు రోజులు జరిగిన సమావేశంలో పలు దిగ్గజ కంపెనీలతో పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ఒప్పందాలు కుదుర్చుకోవడం అభినందనీయమన్నారు. ఒక్క మైక్రోసాఫ్ట్ కంపెనీ 16000 కోట్లతో డాటా సంస్థలను ఏర్పాటు చేయడమంటే రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసే బాటలు వేయడమే అన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నాట్యం చేస్తున్న సంజయ్ వాడపల్లి

నాంపల్లి: శ్రీకృష్ణుడు సత్యభామ మధ్య జరిగే శృంగార సన్నివేశాలను సోలోగా నర్తకుడు సంజయ్ వాడపల్లి నర్తించిన తీరు ఆకట్టుకుంది. ఆదివారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో ప్రముఖ నాట్య గురువు డాక్టర్ నటరాజ రామకృష్ణ శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ వాడపల్లిచే నవజనార్దన పారిజాతం శీర్షికన ప్రత్యేక నృత్యాని ప్రదర్శించారు. లయబద్ధంగా సాగిన నాట్యాంశాలకు వైవిధ్యంగా నర్తించిన సంజయ్ ఆహుతులను మంత్రముగ్ధుల్ని చేశారు. నర్తకిలా తనదైన హావభావాలతో ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచారు. వృత్తిరీత్యా హాంకాంగ్‌లో స్థిరపడ్డ సంజయ్ వాడపల్లి ఆంధ్య నాట్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. నట్య గురువు కళాకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రదర్శనలో చక్కటి నాట్య ప్రదర్శనతో ప్రేక్షకుల్ని మెప్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్‌బీసీ ఎండీ మమత మాదిరెడ్డి, ఐఎఫ్ఎస్ నళిని మోహన్, సత్యనారాయణరాజు, కళాకృష్ణ తదితరులు పాల్గొని నర్తకుడు సంజయ్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.

దేవర కరుణాకర్‌కు ఘన నివాళి



కరుణాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: దివంగత దేవర కరుణాకర్ వంటి నాయకులు అరుదుగా జన్మిస్తారని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ దశదిన కర్మ ఆదివారం గుడిమల్కాపూర్ గ్రీన్ హౌస్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై కరుణాకర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ డివిజన్‌తో పాటు హైదరాబాద్ నగర అభివృద్ధికి తాను ఎంతగానో కృషి చేశారని అన్నారు. కరుణాకర్ కుటుంబసభ్యులు దీప, వంశీ, శ్రీనివాస్‌తో కలిసి కరుణాకర్ జీవితంపై ఏర్పాటు చేసిన చిత్రాలను తిలకించారు.

దేవర కరుణాకర్ నిష్కలంక నాయకుడు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

దేవర కరుణాకర్ నిష్కలంక నాయకుడని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కరుణాకర్ దశదిన కర్మకు హాజరై ఆయన దివంగత నేతకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరుణాకర్‌తో తనకు ఉన్న సుదర్ఘీ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బీజేపీ నాయకులు ఈటల రాజేందర్, చింతల రామచంద్రారెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ స్టాళ్లు ఇప్పించండి



నందకిశోర్ వ్యాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, షాపుల నిర్వాహకులు

అబిడ్స్: అర్హులందరికీ స్టాళ్లు ఇప్పించాలని రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్‌కు మచిలిపురా ఫిషర్‌మెన్ నాయకులు, పలువురు వ్యాపారులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ...మచిలిపురా ఫిషర్‌మెన్ వ్యాపారులు ఎన్నో సంవత్సరాలుగా పాత మార్కెట్‌లో వ్యాపారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వారందరికీ న్యాయం జరిగే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. మంత్రి తలసాని, జోనల్ కమిషనర్ రవికిరణ్ సహకారంతో త్వరలోనే ఫిషర్‌మెన్‌లకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మచిలిపురా వ్యాపారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు కోటి శైలేష్ కురుమ, పప్పుమాత్రే తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



దళితవాడ బసయాత్రలో పాల్గొన్న చైర్మన్ ఆంజనేయులు గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: దళితబంధు పథకం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్‌లోని గుఫానగర్‌లో బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన దళితవాడలో బసయాత్ర 3వ విడత కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. దళితుల కోసం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి దేశంలోనే రికార్డు సాధించిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. దళితుల కోసం కేసీఆర్ ప్రభుత్వం దళిత బంధుతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. దళితులకు అండగా ఉండి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బావను చంపిన హంతకుల అరెస్ట్

గోల్కొండ: సొంత బావను హత్య చేసిన యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చిమ మండలం డీసీపీ జోయల్ డేవిస్ తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ ద్వారకానగర్‌కు చెందిన మహ్మద ఖలీం (24) ఓ ప్రైవేటు సంస్థలో గ్రాసరీస్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఇతను గోల్కొండకు చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ పెళ్లి అమ్మాయి తరపు వారికి ఇష్టం లేదు. దీంతో మహ్మద్ ఖలీంను ఎలాగైనా చంపాలని యువతి కుటుంబసభ్యులు అనుకున్నారు. ఇందులో భాగంగా యువతి సోదరులు మహ్మద్ సైఫ్ (26), మహ్మద్ వసీం (23), మహ్మద్ ఫైసల్ (27), మహ్మద్ సలీం (23) పతకం వేశారు. వారు తమ సోదరితో మాట్లాడి ఇంటికి వచ్చేయమంటూ చెప్పారు. దీనికి ఆమె నిరాకరించింది. అయితే మహ్మద్ ఖలీంతో ఫోన్‌లో మాట్లాడి మనమంతా కలిసి ఉందా అంటూ మభ్యపెట్టారు. గోల్కొండకు వస్తే మీ ఇద్దరికి అద్దె ఇళ్లు చూపెడుతామని చెప్పారు. ఈనెల 15న గోల్కొండ మోతీ దర్వాజకు రమ్మని వారు హతుడితో ఫోన్‌లో తెలిపారు. మహ్మద్ ఖలీం తాను గోల్కొండకు వస్తున్నానని మహ్మద్‌సైఫ్‌కు తెలిపాడు. మోతీ దర్వాజ జీఎంకే గార్డెన్ వద్దకు రావాలని సైఫ్ మహ్మద్ ఖలీంకు తెలిపారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో హతుడు మహ్మద్ ఖలీం మోతీ దర్వాజ వద్దకు రాగానే మాట్లాడుతున్నట్లు నటించి మహ్మద్ సైఫ్ తన సోదరులైన మహ్మద్ వసీం, మహ్మద్ ఫైసల్, మహ్మద్ సమీర్‌తో కలిసి అతనిపై దాడి చేసి నడిరోడ్డుపై హత్య చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు టెక్నికల్ డాటా సహాయంతో నిందితులను గుర్తించి ఈనెల 21న అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి బైక్, రిజిస్ట్రేషన్ లేని యాక్టివా వాహనం, ఒక సత్తూర్, మాంసం కోసే కత్తి, రెండు జీబ పైప్స్, 3 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

బాలిక ఆత్మహత్య

జియాగూడ: ఓ మైనర్ బాలిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ మేయిన్‌రోడ్డు ఇక్బాల్ గంజ్‌లో ఉంటున్న శ్యామ్‌లాల్, సునిత కూతురు మైనర్‌బాలిక (17), స్థానిక అక్షదీప్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుంది. ఆదివారం ఉదయం తండ్రి శ్యామ్‌లాల్ మేకలమండికి వెళ్లగా తల్లి ఇంట్లో ఉన్నప్పటికి తాను పడుకుంటానని చెప్పి గదిలోకి వెళ్లి గడియా వేసుకుంది.

9 గంటల ప్రాంతంలో ఎంతకూ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి కిటికీ నుంచి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనంతరం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.